క్లుప్తంగా

రమాదేవికి నివాళి



నెల్లూరు(బారకాసు): పెనుబర్తికి చెందిన నూకలపాటి రమాదేవి ఇటీవల మరణించారు. ఈ క్రమంలో గ్రామానికి వెళ్లి ఆమె చిత్రపటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్ రెడ్డి బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త రఘురామిరెడ్డి, కుమారుడు మహేష్‌రెడ్డిని పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు వెంకటేశ్వర్లు రెడ్డి, పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, చిరమన శ్రీనివాసులురెడ్డి, విజయ్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు తరలింపునకు సమయమివ్వరూ..



నెల్లూరు(సెంట్రల్): పడుగుపాడు రైల్వేస్టేషన్ వద్ద గల మసీదు తరలింపునకు కొంత సమయమివ్వాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ఓఎస్డీ పెంచలరెడ్డి కోరారు. ఈ మేరకు నగరానికి విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఇనమడుగు సెంటర్‌లోని మసీద్ రైల్వే స్థలంలో ఉందని, దీన్ని తొలగించాలని అధికారులు ఆదేశించారని చెప్పారు. వేరే చోట స్థలం చూసేంత వరకు కొంత సమయమివ్వాలని కోరారు. సర్ఫరాజ్, నేతలు మసూద్, అహ్మద్‌బాషా, షకీల్, ఫయాజ్, యాసిన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా నరసింహారావు బాధ్యతలను బుధవారం స్వీకరించారు. తొలుత ఆయనకు పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

‘సూపర్ సిక్స్’కు మొండిచేయి

• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్లో కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. నగరాభివృద్ధిని విస్మరించి.. తన సంస్థ ఉద్యోగులకు లబ్ధి చేకూర్చేలా మూడు నియోజకవర్గాల ప్రజలకు మంత్రి నారాయణ అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అప్పులను సాకుగా చూపి నామమాత్రపు కేటాయింపులు జరపడం విచారకరమని చెప్పారు. ప్రస్తుత పాలనను చూసిన ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు వదులుకున్నామనని ఆలోచిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వోద్యోగులకు ఐఆర్.. ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలను ఇస్తామని చెప్పినా, అవీ నోచుకోవడంలేదన్నారు. నెల్లూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పిన మంత్రి నారాయణ దాన్ని మరిచి ఆక్రమణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లతో జాఫర్‌సాహెబ్, సర్వేపల్లి కాలువలకు రివిట్మెంట్ పనులను చేపట్టడంతో పాటు వాకింగ్ ట్రాక్‌ను సుందరీకరించిన అంశాన్ని గుర్తుచేశారు. సర్వేపల్లి కాలువ వెంబడి తన వారికి లబ్ధి చేకూర్చేలా దుకాణాలను ఏర్పాటు చేసి ఆక్రమణలకు నారాయణ తెరలేపుతున్నారని మండిపడ్డారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయ అడ్మిన్, వార్డు ప్లానింగ్, వీఆర్వోలు, కార్యదర్శులు రోజూ ఉదయం ఎనిమిది గంటలకే విధులకు హాజరుకావాలని సూచించారు. అసెస్మెంట్ నంబర్లు లేని భవన వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అనధికార నిర్మాణాలను గుర్తించాలని చెప్పారు. ఆస్తి పన్ను రివిజన్ విధానాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా కృషి చేయాలని కోరారు.

అనిల్‌తో మిథున్‌రెడ్డి భేటీ



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌తో రాజంపేట ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఇస్కాన్ సిటీలోని అనిల్ నివాసంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

నేడు బాధ్యతలు చేపట్టనున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్‌గా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి బాధ్యతలను గురువారం స్వీకరించనున్నారని జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నెల్లూరు రూరల్, కైకలూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కామినేని శ్రీనివాస్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారని చెప్పారు.

ధాబా నిర్వాహకుడిపై దాడి

• రూ.లక్ష ఆస్తి నష్టం

నెల్లూరు(క్రైమ్): వ్యాపారంలో నెలకొన్న పోటీతత్వం.. పత్రికల్లో వార్తలు రాయించారనే అనుమానంతో ఓ ధాబా నిర్వాహకుడిపై దాడి చేయడంతో పాటు అక్కడి వస్తువులను ధ్వంసం చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జొన్నవాడ రోడ్డులో ఫాల్గుణా ధాబాను బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటశ్రీకాంత్ నిర్వహిస్తున్నారు. నగరానికి చెందిన జనార్దన్ సైతం అదే రహదారిలో రెడ్డి ధాబాను నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో వీరి మధ్య పోటీతత్వం నెలకొంది. ధాబాలకు సంబంధించి ఓ పత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనంలో రెడ్డి ధాబా ఫొటో వచ్చింది. శ్రీకాంతే రాయించి ఉంటారనే అనుమానంతో జనార్దన్ కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో జనార్దన్ తన స్నేహితులు మురళీ, కార్తీక్‌తో కలిసి ఫాల్గుణా ధాబాకు మంగళవారం వెళ్లి నిర్వాహకుడు శ్రీకాంత్‌పై దాడి చేశారు. అక్కడున్న వస్తువులను ధ్వంసం చేశారు. స్థానికులు వస్తుండటాన్ని గమనించిన నిందితులు పరారయ్యారు. దీనిపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల కోసం పోరాడాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి వాణి

నెల్లూరు (టౌన్): బాలలు తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని లోక్ అదాలత్ జడ్జి వాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు ర్యాలీని బుధవారం నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి.. బాలల హక్కులను పరిరక్షించాలంటూ నినాదాలు చేశారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఐఓ శ్రీనివాసులు మాట్లాడారు. బాలల చదువులు, భావవ్యక్తీకరణ హక్కులను కాపాడాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీపీఓ సురేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గౌస్, డీఎస్పీ చెంచురామారావు, సీఐలు సుబ్బారావు, కృష్ణారెడ్డి, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పద్యం.. హాస్యంపై సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): చాటు పద్యం.. హాస్యం అనే అంశంపై పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, శేషగిరీశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.

డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న సత్యప్రకాష్ సింగ్

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్యప్రకాష్ సింగ్ ఆదేశించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఏపీజీబీ వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఏపీజీబీ ద్వారా మరింత మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే, డిపాజిట్లపై అధిక వడ్డీని తమ బ్యాంక్ అందిస్తోందని చెప్పారు. గడిచిన రెండు నెలల్లో తక్కువ వడ్డీకే రైతులకు రూ.80 కోట్ల పంట రుణాలను మంజూరు చేశామని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల డిపాజిట్ల సేకరణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం డిపాజిట్ల సేకరణ, బ్యాంక్ కొత్త ఖాతాలు, రుణ లక్ష్యాలను సాధించిన మేనేజర్లకు అవార్డులను అందజేశారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ సంజీవప్ప, రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, చీఫ్ మేనేజర్లు ఆంజనేయులు, శ్రీకాంత్‌నెహ్రూ, సీనియర్ మేనేజర్లు బాలాజీ, అజయ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో శబరిమలవాసుడికి పడికర్పూర దీపం, విశేష పూజలను బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా కామాక్షమ్మ, భారతమ్మ, మధుసూదన్ రెడ్డి, సుహాసిని తదితరులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య పాల్గొన్నారు.

చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం



నెల్లూరు(బృందావనం): చేనేత, హస్తకళలను ప్రజలు ఆదరించాలని కళా సంస్కృతి చేనేత, హస్తకళా సంస్థ నిర్వాహకుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. మినీబైపాస్‌లోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో చేనేత, హస్తకళా ప్రదర్శనను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 15 రాష్ట్రాలకు చెందిన కాటన్, శిల్క్, జరీ, కలంకారీ చీరలు, బెడ్‌షీట్లు, ఖాదీ చొక్కాలు, కుర్తాస్ తదితరాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు. రోజూ ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

• 34 సవర్ల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఇంటి తాళాలను పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లిన పాతనేరస్తుడ్ని పోలీసులు అరెస్ట్ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో నిందితుడి వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, స్థానిక ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు వెల్లడించారు. గుర్రాలమడుగు సంఘంలో విజయకుమారి తన కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు.

ఈ క్రమంలో రేకుల ఇంటికి తాళమేసి నూతనంగా నిర్మించిన మరో ఇంట్లో ఈ నెల 14వ తేదీ రాత్రి నిద్రించారు. ఈ తరుణంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. చోరీ ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటన స్థలంలో లభ్యమైన ఆధారాలు, సాంకేతికత ఆధారంగా నిందితుడ్ని తమిళనాడులోని వేలూరు వసంతపురానికి చెందిన పాతనేరస్తుడైన మారి రంజిత్‌కుమార్‌గా గుర్తించారు. దీంతో అరెస్ట్ చేసి రూ.19.5 లక్షల విలువైన 34 సవర్ల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చిత్తూరు, తిరుపతి, వేదాయపాళెం, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని డీఎస్పీ చెప్పారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, సిబ్బంది సుధాకర్, శివ, తిరుపతయ్య తదితరులను ఎస్పీ కృష్ణకాంత్ అభినందించి రివార్డులను ప్రకటించారని డీఎస్పీ తెలిపారు.

అడవుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

• డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా



నెల్లూరు(అర్బన్): జిల్లాలో అడవుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా ఆదేశించారు. వేదాయపాళెంలోని జిల్లా కార్యాలయంలో రేంజర్లతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురిసిన నేపథ్యంలో అడవుల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను పెద్ద సంఖ్యలో నాటి వాటిని కాపాడాలని కోరారు. నెల్లూరు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే నగరవనంలో పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్ల కటింగ్‌ను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయించాలని కోరారు. మొక్కల పెంపకం, నెలవారీ ప్రణాళికల లక్ష్యాల పై సమీక్షించారు. నెల్లూరు, రాపూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, రామిరెడ్డి, శేఖర్, కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పూర్వ వైభవానికి కృషి



మాట్లాడుతున్న కుమార్‌రాజా

నెల్లూరు రూరల్: గ్రంథాలయాల పూర్వ వైభవానికి కృషి చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా పేర్కొన్నారు. రేబాలవారివీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. చిన్నారులు గ్రంథాలయాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. తొలుత నటరాజ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యోగాసనాలను సాధన్ ప్రదర్శించారు. అనంతరం అతిథులకు మహాత్మాగాంధీ సత్యశోధన, ఆత్మకథ పుస్తకాలను అందజేసి ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేంద్రరావు, నటరాజ నృత్య అకాడమీ శిక్షకురాలు త్రిపుర, మంజుల, సమత, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించడంతో పాటు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనమివ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్ డిమాండ్ చేశారు. నగరంలోని విద్యుత్ భవన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఈ విజయన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నేతలు సుబ్రహ్మణ్యం, సునీల్, వసంత్, భాస్కర్, రమేష్, మౌలాలీ, అబ్దుల్, హరి, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.